హైదరాబాద్ వార్త



# ధరలకు రెక్కలు



**-కిచెన్‌కు రానంటున్న టమోటా -కోయకుండానే కన్నీరు పెట్టిస్తున్న ఉల్లిగడ్డ**

**-రిటైల్ మార్కెట్‌లో రూ.100 దాటిన కిలో టమాటా -ఉల్లి కిలోకు రూ.70 నుంచి రూ.80**

**-చిక్కుడుకాయ కిలో రూ.100లు - బీన్స్ రూ.100, క్యారెట్ రూ.80**

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త**

టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. నెలన్నర క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయలు పలికిన టమాటా ధర ఇప్పుడు భారీగా పెరిగింది. గత పదిహేను రోజుల్లో టమోటా ధర డబుల్ అయింది. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో 80 రూపాయలు పలుకుతోంది. రిటైల్ అయితే 100 దాటింది. డిమాండ్‌కు సరిపడ టామాటా రాకపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు కూరగాయల వ్యాపారులు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాట పంటలు దెబ్బతిన్నాయని, దీంతో ధరలు అమాంతం పెరిగాయని చెబుతున్నారు. హైదరాబాద్‌కు తెలంగాణలోని జిల్లాల నుంచే కాకుండా రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా టమాట వస్తుంది. ఇతర రాష్ట్రాల నుంచి పంట రాక తగ్గడంతోపాటు రాష్ట్రంలో దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. సాధారణంగా టమాటా ధర వేసవి కాలంలో ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ధర తక్కువగా ఉండాలి.

ఉల్లి ధరలు కూడా భారీగానే పెరిగింది. రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి 70 నుంచి 80 రూపాయలు పలుకుతుంది. కేంద్రం ఉల్లి ఎగుమతిపై సుంకం ఎత్తివేయడంతో ధరలు భారీగా పెరిగాయి. ఐదే సామాన్యులపై భారాన్ని తగ్గించడానికి కేంద్రం బఫర్ స్టాక్‌ను రిలీజ్ చేసింది. అలాగే నాఫెడ్ ద్వారా 35 రూపాయలకే కిలో ఉల్లిని విక్రయిస్తోంది. ఇక, వెల్లుల్లి ధర కూడా భారీగానే పెరిగింది. మంచి క్వాలిటీ ఉన్న వెల్లుల్లి కిలో రూ.500 పలుకుతోంది. ఇక మిగతా కూరగాయల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రస్తుతం రూ.200లు పెడితే రెండు మూడు రకాల కూరగాయలను కూడా కొనలేని పరిస్థితి ఉంది. కొన్ని రకాలయితే రూ.30 వెచ్చించనిదే పావుకిలో రావడం లేదు. చిక్కుడుకాయ రూ.80, బెండకాయ రూ.70, దొండకాయ రూ.70, వంకాయ 70, కాకరకాయ రూ.70, బీరకాయ రూ.80, క్యారెట్ రూ.70, ఆలుగడ్డ రూ.50, క్యాప్సికమ్ రూ.80 చొప్పున అమ్ముతున్నారు. ఒక్క హైదరాబాద్ దినసరి టమాటా వినియోగం సగటున 5వేల క్వింటాళ్ల నుంచి 6వేల క్వింటాళ్లు ఉంటుంది. దీంతో డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేకపోవడంతో ధర అమాంతం పెంచేశారు. మునగకాయ ఒక్కటి రూ.10లు చొప్పున, ఆకు కూరల ధరలదీ అదే తీరు. రూ.10కి గతంలో మూడు నాలుగు కట్టలు ఇచ్చే కొత్తిమీర, పెద్ద కట్ట ఒకటి చొప్పున రూ.60లు చొప్పున అమ్ముతున్నారు. పాలకూర కూడా ఆదే ధర పలుకుతున్నది. దీంతో చిన్న మెంతి, కరివేపాకు..ప్రస్తుతం ఒక్కటితో సరిపెడుతున్నారు.ఇక స్కిన్‌లేస్ చికెన్ కిలో రూ.300లకు పెరిగింది. కోడి గుడ్ల ధరలు కూడా పెరిగాయి. గుడ్డు ఒక్కొక్కటి 6 రూపాయలు పలుకుతుంది. ఇది చాలదు అన్నట్లుగా వంట నూనె ధరలు కూడా పెరిగాయి. దీంతో సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడింది.

కొనబోతే కొరివి అన్నట్లుందని, ఎక్కడ చూసినా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతు బజార్లలో ఒకరేటు, బస్తీల, కాలనీలలో కూరగాయల మార్కెట్‌లలో మరోరేట్లు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలంటున్నారు. రాజకీయ పార్టీలు ఎన్ని ఉన్నా ధరలు తగ్గించేందుకు ఏ ఒక్కరు కృషిచేసిన పాపాన పోలేదంటున్నారు. ఏంకొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదని సామాన్యులు వాపోతున్నారు. కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్ మోండా, మాదన్నపేట వంటి మార్కెట్‌లతో పాటు గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు రోజువారీగా దిగుమతి కూరగాయల రాక తగ్గిపోయింది. దీంతో ధరలు విపరీతంగా పెరిగాయి. నగర జనాభా ప్రకారం ప్రతి రోజు సుమారు మూడు వేల టన్నుల కూరగాయలు అవసరం.

నగరానికి కూరగాయ దిగుమతి తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కర్ణాటకలోని చిక్‌బల్లాపూర్ నుంచి దిగుమతి అవుతాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూరగాయల దిగుబడి భారీగా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



జిహెచ్ఎంసిలో జరిగిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న నగర మేయర్ విజయలక్ష్మి



సైబారాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

# మళ్లీ విస్తరిస్తున్న రోగాలు



**-డెంగీ కేసులతో రోగుల ఆందోళన**

**-తుమ్మినా, దగ్గినా ఆందోళన**

**చెదుతున్న జనాలు**

**-చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు**

**హైదరాబాద్, అక్టోబర్ 9 ప్రభాతవార్తః**

నగరంలో రోజురోజుకు డెంగీ, చికున్‌గున్యా, మలేరియా రోగుల సంఖ్య పెరిగిపోతోంది. కేవలం కొంత వ్యవధిలో తగ్గినట్లే తగ్గి తిరిగి విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులు క్యూలు కడుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు లాంటివి పెరిగిపోతున్నాయి. కేసుల సంఖ్య పెరిగిపోతుండడంతో అధికారులు అప్రమత్తంగానే ఉంటున్నారు. స్వల్ప వ్యవధిలోనే వర్షాలు కురవడం, మురికినీరు ఎక్కడికక్కడే నిలిచిఉండడం వల్ల రోగుల సంఖ్య పెరిగిపోతున్నట్లు గుర్తించినప్పటికి అధికారులు ఎందుకో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు, ముఖ్యంగా మురికి వాడల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా రోగుల సంఖ్య పెరిగపోతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నప్పటికి పరిస్థితులు ప్రజల పరిధిలో లేకుండా పోయాయి.

**పెరుగుతున్న రోగుల సంఖ్య....**

డెంగీ, చికున్‌గున్యా, మలేరియా లంటి రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చాలా వరకు ప్రభుత్వ ఆస్పత్రులలో చేరిన వారినే లెక్కలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రధాన అస్పత్రులలో చేరిన వారికి చికిత్స అందజేస్తున్నప్పటికి బస్తీ దవాఖానాలలో ఇందుకు సంబంధించిన చికిత్సలు అంతంత మాత్రమే. ఈ యేడు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో డెంగీ, చికున్‌గుణ్యా, మలేరియాలాంటి వ్యాధులతో ప్రజలు అవస్థలు పడ్డారు. కొన్ని రోజల కిందటి వరకు తగ్గినట్లే తగ్గి తిరిగి పుంచుకుంటున్నాయి. ఈయేడు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు ఇరవై వేల వరకు కేసులు నమోదైనప్పటికీ హైదరాబాద్ నగరంలోలోనే రోగుల సంఖ్య అధికంగా కనిపిస్తోంది. దాదాపు ఏడు వేల కేసులు ఇక్కడే వెలుగులోకి వచ్చాయి. ఇదీలా ఉండగా ప్రైవేట్ ఆస్పత్రులో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా లాంటి కేసులను పెద్దగా లెక్కిస్తున్నట్లుగా లేదు. దీంతో రోగుల సంఖ్య తక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. రోగుల వివరాలను అందజేస్తున్నట్లు అనిపించడం లేదు. హైదరాబాద్ నగరంలో డెంగీ హైరిస్క్ ప్రాంతాలను గుర్తించినప్పటికి ప్రజలకు సరైన అవగాహన కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా డెంగీ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా అదీ అంతంత మాత్రమే. గతంలో డెంగీ కేసులు పెరిగినప్పుడు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు జరిగింది. ప్రత్యేకంగా డెంగీ పరీక్షా కేంద్రాలు, ఆస్పత్రుల పట్ల ప్రత్యేక శ్రద్ధపెట్టారు. అవసరమైన మేరకు బ్లడ్ బ్యాంకులు, ప్లేట్‌లేట్ యూనిట్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. దోమలు విస్తరించకుండా కలెక్టర్‌ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి అన్ని విధాల చర్యలు తీసుకున్నారు. తాజాగా మళ్లీ కేసులు పెరిగిపోతున్నాయి. కొన్ని రోజుల కిందటి వరకు వర్షాలు కురిసిన కారణంగా చాలాచోట్ల మురికినీరు నిలువుందిపోయింది. దీంతో మళ్లీ దోములు స్వైర విహారం చేస్తున్నాయి.ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల 8వ తేదీ వరకు హైదరాబాద్‌లో 3వేలకుపైగా డెంగీ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

**అధికారులు తీసుకోవాల్సిన చర్యలు.**

కొన్ని రోజుల కిందటి వరకు రోగాల వ్యాప్తి తగ్గుముఖం పట్టినప్పటికి హైదరాబాద్ నగరంలో తిరిగి వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. రకరకాల వైరల్ జ్వరాలు కలిసి ప్రజలను ఊపిరి పీల్చుకోకుండా చేస్తున్నాయి. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా లాంటి రోగాలు జనాలను వెంటాడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాకుండా ప్రైవేట్ ఆస్పత్రులలో కూడా రోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఏ చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రజలు బెంబెలుపడిపోతున్నారు. డెంగీలాంటి వ్యాధి వచ్చిందేమోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. గతంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా తీసుకున్న చర్యలను మళ్లి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్లేట్‌లెట్ కౌంటింగ్ లాంటి పరీక్షలతో పాటు ఐజీఎం పరిక్షలు జరిపిస్తే ఫలితాలు ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి దోమల ఉత్పత్తి నివారణ చర్యలు ప్రజలకు వివరించి అప్రమత్తం చేశారు. ఇలాంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబురాలు



**అత్తాపూర్ అక్టోబరు9,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.పరిపాలన భవనం ఆవరణలో తొలుత విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్,పరిశోధన సంచాలకులు డాక్టర్.పి రఘురామిరెడ్డి గౌరమ్మకి పూజలు చేశారు.బతుకమ్మ మన సంస్కృతికి ప్రతీక అని ఆయనన్నారు.తర్వాత మహిళ అధికారులు,ఉద్యోగులు ఆడుతూ పాడుతూ బతుకమ్మ సంబరాలు చేశారు.పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించిన హీరో ప్రభాస్



రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న హీరో ప్రభాస్

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 9, ప్రభాతవార్త**

సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కూతురు గుండెపోటుతో మరణించడంతో బుధవారం హీరో ప్రభాస్ ఆయనను పరామర్శించారు. కూకట్‌పల్లిలోని రాజేంద్రప్రసాద్ నివాసంనికి ప్రభాస్ వెళ్లి గాయత్రి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

## ఆటోకార్మికులకిచ్చిన హామీలను అమలుచేయాలి

**నాంపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త :**



మహాధర్నా పోస్టరును ఆవిష్కరిస్తున్న వెంకటేశం, జంగయ్య, మారయ్య, సత్తిరెడ్డి, లింగంగౌడ్, బిక్షపతి తదితర నాయకులు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ మానిఫెస్టోలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ జెఏసి లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో బుధవారం జెఏసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నవంబరు 5న ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్స్ జెఏసి ఆటోడ్రైవర్స్ డిమాండ్ల సాధనకు నిర్వహించనున్న మహాధర్నా వాల్‌పోస్టరును ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బి.వెంకటేశం, సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఎ.బిక్షపతి యాదవ్, వి.మారయ్య, పి.శ్రీకాంత్, లింగంగౌడ్, వి.ప్రవీణ్, డి.శ్రీనివాస్, ఎం.ఎ.సలీమ్, ఎ.సత్తిరెడ్డి, మీర్జారఫాత్‌బేగ్ తదితర వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం బి.వెంకటేశం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ప్రతీ ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి 12వేల ఆర్థిక సహాయం, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించి, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చాలన్లను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా 50శాతం తగ్గింపుతో క్లియర్ చేస్తామన్న హామీలను మరచిపోవడం అన్యాయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. వి.మారయ్య గత 11ఏళ్లుగా ఆటోమీటర్ చార్జీలు పెంచలేదని, వెంటనే పెంచాలని కోరారు. తమకు సామాజిక భద్రత, ముఖ్యమైన ప్రయోజనాలు అందడంలేదని, ఆటోడ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేసి సంక్షేమ ఫలాలను అందించాలని పి.శ్రీకాంత్ విజ్ఞప్తిచేశారు. ఎ.సత్తిరెడ్డి గ్రేటర్ హైదరాబాద్‌లో కొత్త ఆటో పర్మిట్లను జారీచేయాలన్నారు. నవంబరు 5న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాలో వేలాదిమంది ఆటోడ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులంతా కోరారు.

## ప్రధాని నివాసంలో బాలాపూర్ లడ్డూ అందజేత



ప్రధాని నివాసం లోక కళ్యాణ్ మార్గ్‌లో బాలాపూర్ గణేష్ లడ్డూతో శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**

సుప్రసిద్ధ బాలాపూర్ గణేషుని వేలం లడ్డూను బిజెపి జాతీయ అగ్రనేతలైన కేంద్ర కేబినెట్ మంత్రులు అమిత్‌షా, జెపి నడ్డాలకు తన పేరు మీద అందించాలని ప్రధాని నరేంద్ర మోడి తనకు సూచించారని లడ్డూ వేలం, తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి వెల్లడించారు. మోడీ జన్మదినం రోజు జరిగిన బాలాపూర్ గణేష్ నిమజ్జన శోభాయాత్ర, లడ్డూ వేలంలో రూ.30.01 లక్షలకు కైవసం చేసుకున్న లడ్డూను మోడీకి అందజేస్తానని ప్రకటించిన శంకర్‌రెడ్డి లడ్డూతో ఇటీవల ఢిల్లీకి వెళ్ళారు. అయితే బుధవారం తన బృందంతో కలిసి ఢిల్లీలోని లోక కళ్యాణ్ మార్గ్‌లోని మోడీ నివాసానికి వెళ్ళానని అయితే అక్కడ ప్రధాని ఎంతో భక్తితో లడ్డూను అందుకొని అభినందించారని శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన దక్షిణ భారత ప్రజలకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి తన పేరిట లడ్డూను అమిత్‌షా, నడ్డాలకు అందజేయాలని సూచించారని శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శంకర్‌రెడ్డితో పాటు మోడీ నివాసానికి వెళ్ళిన వారిలో మీర్‌పేట్ బిజెపి నేతలు గాజుల మధు,రాత్లావత్ రవినాయక్, చెవ్వ శ్రవణ్, డి.శ్రీనివాస్‌లు ఉన్నారు.

## హత్యకు గురైన మహిళ కేసులో వీడిన మిస్టరీ

**-సిసి పుటేజీ,కాల్ డేటా ఆధారంగా నిందితుడి అరెస్ట్**

**బంజారాహిల్స్ అక్టోబరు9,ప్రభాతవార్త**

జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 30వ తేదీన యూసఫ్‌గూడా నవోదయ కాలనీలో తన ఇంట్లో దారుణహత్యకు గురైన మహిళ హత్య కేసును జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు.హత్యకు పాల్పడిన నిందితుడు షేక్ జావీద్ అలియాస్ జావీద్‌ఖాన్ అలియాస్ అమీర్ ఆలీ (34)ను చెంగిచెర్ల క్రాంతి నగర్ కాలనీ సమీపంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలియజేసారు. జూబ్లీహిల్స్ పీఎస్ ఎస్ హెచ్ ఓ కె.వెంకటేశ్వరరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కాజీపేట వరంగల్ కు చెందిన షేక్ జావీద్ (34) నగరంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు.ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ఇతను యూసఫ్‌గూడ నవోదయ కాలనీ గణపతి కాంప్లెక్సు ప్లాట్ నెంబర్ 36లో నివసిస్తున్న సుధారాణి అనే మహిళ వద్ద రెండు సంవత్సరాలుగా చిట్టీలు వేస్తున్నాడు.ఈ క్రమంలో తాను వేసిన చిట్టీని పాట పాడిన తరువాత ఆమె తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం,తనను బెదిరింపులకు గురిచేయడంతోనే నిందితుడు మహిళను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించాడన్నారు.అదే నెల 27వ తేదీన ఒక సారి ఆమె ఉండే నివాసం వద్ద పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి 30వ తేదీన ఇంట్లోకి ప్రవేశించి ఆమె ను హత్య చేసాడన్నారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వక పోవడం,ఎన్ని సార్లు అడిగినా తననే తిరిగి బెదిరించడంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు వెల్లడించాడన్నారు.నాలుగు నెలల క్రితం నలుగురితో కల్సి తనపై దాడి కూడా చేసిందని,దాంతో మహిళపై కక్ష్య పెంచుకుని దారుణానికి పాల్పడ్డాడన్నారు.మహిళ హత్య కేసు నమోదు చేసుకుని సీసీ పుటేజీలను పరిశీలించడంతో పాటు కాల్ డేటా ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.ఎస్ హెచ్ ఓ కె. వెంకటేశ్వరరెడ్డి తెలియజేసారు.

## వర్గీకరణ, క్రీమిలేయర్‌లపై రివ్యూపిటిషన్‌ల డిస్మిస్ వెనుక పెద్దకుట్ర

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** వర్గీకరణ, క్రిమిలేబర్‌లపై రివ్యూపిటిషన్‌ల డిస్మిస్ వెనుక పెద్దకుట్ర దాగి ఉందని దళిత బహుజన పార్టీ(డిబిపి) జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. 'గురువారం దళిత బహుజన పార్టీ(డిబిపి) కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ దీనికి వెనుక ప్రధానమంత్రి మోదీ, పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణల హస్త ఉందని అన్నారు. మనువాద పాలకుల విధానంను సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ప్రకటించారని, రాజ్యాంగ వ్యతిరేకంగా తీర్పులివ్వడం జాతీయ జ్యూడిషియల్ స్వతంత్ర వ్యవస్థ కూడా కలుషితం అయిందని అర్థమైందన్నారు. ఈ తీర్పుతో మెజారిటీ దళిత సమాజం ప్రధానంగా మాల, బేగరి, నేతకాని, దాసరి, మహర్ వంటికులాలు ఆందోళన చెందవద్దని, ఇంకా రాజ్యాంగపరమైన వెసులుబాటు కురేటివ్ పిటిషన్ దాఖలు వంటి అవకాశం ఉందన్నారు. ఇక ప్రజా ఉద్యమం మోదీ, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, పవన్‌కల్యాణ్‌లపై చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తిరుబుటుకు సిద్ధం కాకపోతే భవిష్యత్ లేదన్నారు. డిసెంబరు రెండవ వారంలో దళితులు తిరుగుబాటు పేరుతో వర్గీకరణ వద్ద, రాజ్యాధికారం తీర్మాణం చేశారని, జిల్లాస్థాయిలో ఆందోళస సభలు నిర్వహించాలని, ఈ ఉద్యమంను జాతీయస్థాయిలోనిర్మాణం చేయాలని, వర్గీకరణ, క్రిమిలేయర్‌కు అనుకూతంగా సిఎం రేవంత్‌రెడి, కాంగ్రెస్, బిజెపి కేంద్ర సర్కార్‌లపై పోరాటం పెద్దఎత్తున నిర్వహించాలని, వర్గీకరణకు వ్యతిరేకంగా ఉండే డిబిపి వంటి దళిత పార్టీల ప్రతినిధులకు చట్టసభలకు పంపడం ద్వారా వర్గీకరణనుఅడ్డుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సిహెచ్.రోజా లీలా, డిబిపి గ్రేటర్ వర్కింగ్‌ప్రెసిడెంట్ చిప్పటి సుబ్బారావు, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, వంచిత్ బహుజన ఆఘాడి(విబిఎ) రాష్ట్ర కార్యదర్శి తీగల శేఖర్, మాల మహానాడు(శ్రీకృష్ణవర్గం) జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.సుచంద్ర, దర్జీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల సినీల్‌చంద్రరావు, ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కొర్రా హరీష్, లంబాడి హక్కుల పోరాటసమితి (ఎల్‌హెచ్‌పిఎస్) రాష్ట్ర నాయకులు మాలోత్ రవీంద్ర పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న దళిత బహుజన పార్టీ(డిబిపి) జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్

## సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన బల్కంపేట్ ఎల్లమ్మవారు

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 9, ప్రభాతవార్త**

బల్కంపేట ఎల్లమ్మవారు 7వ రోజు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం ఆలయంలోని మూలవిరాట్ అమ్మవారిని వివిధ రకాల పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిల్లతో చూడముచ్చటగా అలంకరించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దగ్గరుండి చూసుకుంటున్న ఈఓ బి.కృష్ణ, ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్ కుమార్, రంగాచార్యులు వచ్చిన భక్తులకు వేదాశీర్వచనాలు చేస్తూ అమ్మవారి దీవెనలు వుండాలని దీవించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



శ్రీ సరస్వతీ దేవిగా బల్కంపేట్ ఎల్లమ్మవారు

## సీనియర్ సిటిజన్స్‌కు ఆసరా వస్తువుల అందజేత



సీనియర్ సిటిజన్స్ కు ఆసరా వస్తూవుల అందించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:**
అంతర్జాతీయ వయోధిక దినోత్స వం పురస్కరించుకుని అరవై ఏండ్లపైబడిన వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ట్రస్ట్, వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ వైఎస్ఆర్.మూర్తి నిర్వహ ణలో వీల్‌చైర్స్, పూత కర్రలను పంపిణీ చేసే కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ డైరెక్టర్ ఎ.శేషగిరిరావు కార్యక్రమాన్ని ప్రారం భించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమం కోసంప్రవేశపెట్టిన రూ.5లక్షల ఆయుష్మాన్‌భారత్ పథకం గురించి వివరించారు. వైఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ నాలుగు సంవత్స రాలుగా వృద్ధులకు ట్రస్ట్ చేస్తున్న సహాయ సహకారాలు గురించి వివరించారు. కరోనా సమయంలో వృద్ధులకు అందిం చిన సహాయం వారి ప్రతిభ వెలుగులోకి తెచ్చేందుకు నిర్వహి స్తున్న పాటలపోటీల గురించి వివరించారు. హెల్ ఏజ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ శ్యామ్ మాట్లాడుతూ నేడు జరుగుతున్న మోసాల గురించి వివరిస్తూ వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ ఓవిఎస్‌డి.ప్రసాద్ వయోవృద్ధులకు ఎట్టి అవసరాలు వచ్చినా తమను సంప్రదిం చాలని కోరారు. తొంబై సంవత్స రాలుపైబడిన టీవీ.సుబ్రహ్మ ణ్యంను సైబర్ క్రైమ్ విషయ నిపుణులు శ్యామ్‌ను సత్కరించారు.

### భక్తుల జయజయధ్వానాలతో మారుమ్రోగుతున్న ఆలయాలు



సరస్వతి అలంకారంతో అమ్మవారు

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** భక్తులు జయజయధ్వానా లతో వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం మారుమ్రో గింది. శ్రీదేవి శరన్నవరాత్రోత్స వాలలో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమి చ్చారు. అయం ఈవో మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ నేతృత్వంలో జరిగే ఈ ఉత్స వాలను పురస్క రించుకుని అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణల చేశారు. సరస్వతిదేవిని దర్శించుకోవడం ద్వారా విద్యార్థులు వాగ్దేవి అనుగ్రహం పొంది సర్వవిద్యలలో రాణిస్తారని భక్తుల నమ్మకం. కాగా గురువారం అమ్మవారు దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవి అలంకారంతో దర్శనమిస్తారు. కాగా గురువారం అమ్మ వారు దుర్గాదేవి అలంకారంతో దర్శనమిస్తారు.

## ప్రారంభమైన దుర్గా మాత మహోత్సవాలు



శ్రీ దుర్గా మాత మహోత్స వాలలో పాల్గొన్న మహిళలు

**చార్మినార్, అక్టోబరు 9 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీలోని ఘాన్సీ బజార్, కోకరివాడి, షక్కర్‌కో ట, చేలాపుర, ఝూలా, రికాబ్‌గంజ్, ఆనందగల్లీ, మీరాలం మండి, పెట్లాబుర్జుతో పాటు పలు ప్రాంతాలలో వేలాది మంది బెంగా లీలు ఉన్నారు. ప్రతీ సంవత్స రం బెంగాలీలు ఎంతో వైభవంగా శ్రీ దుర్గామాత ఉత్స వాలను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్ చార్‌కమాన్ బెంగాలీ సమితితో పాటు పన్నెండు బెంగాలీ సంఘాలు పలు ప్రాంతాలలో శ్రీ దుర్గా మాత విగ్రహాలను ప్రతిష్టించారు. చార్‌కమాన్‌లోని పి. సత్యనారాయణ భవన్‌లో జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ బెంగాలీ సమతి అధ్యక్షులు దీపాంకర్ పాల్ మాట్లాడుతూ గత ఇరవై ఐదు సంవత్స రాలు నుంచి ఘనంగా శ్రీ దుర్గా మాత ఉత్స వాలను వైభవంగా జరుపుతున్నామని తెలిపారు. కార్యక్ర మంలో హైదరాబాద్ చారకమాన్ బెంగాలీ సమితి అధ్యక్షులు బాబూలాల్, మహిళా కమిటి అధ్యక్షురాలు మంజిరా నస్కర్, సిఎ తుంపా, మూ నస్కర్‌లు పాల్గొన్నారు.

### ప్రతి వ్యక్తి భక్తి మార్గంలో నడవాలి : రమేష్ యాదవ్



శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్స వాలలో పాల్గొన్న బిజెపి నాయకులు రమేష్ యాదవ్, భక్తులు

**యాకుత్‌పుర, అక్టోబరు 9 ప్రభాతవార్త :** శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్స వాలు సందర్భంగా పూలబండ క్రాంతి యూత్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ దుర్గా మాత విగ్రహానికి సీనియర్ బిజెపి నాయకులు రమేష్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు రమేష్ యాదవ్ మాట్లాడు తూ కార్యక్రమంలో పూజ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతిని ధులు మహేష్, సంతోష్ ప్రవీణ్, రమ, తులసి, శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.



అంబర్‌పేట్ నియోజకవర్గంలోని అలీకేఫ్ చౌరస్తా వద్ద ఉన్న ఎస్.ఆర్.జి ఫంక్షన్ హాల్‌లో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, కాంటెస్టెడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రోహిన్ రెడ్డి, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్ సీనియర్ నాయకులు పాల్గొన్న దృశ్యం

# కేంద్రప్రభుత్వం గోవును జాతీయమాతగా ప్రకటించాలి

**-పరమపూజ్య జగద్గురు శంకరాచార్యస్వామి శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతిస్వామిజీ**

**రవీంద్రభారతి, అక్టోబరు 9 ప్రభాతవార్త :**
గోవు యావత్ జగతికి కేవలం పాలను అందించడమే కాక ప్రతీఒక్కరికీ ఎన్నోవి ధాలా ప్రయోజనకారే కాక 33కోట్ల దేవతల ప్రతిరూపంగా గోమాతని హిందువులు పూజిస్తారని, తొలిరొట్టెను ఆ 33కోట్ల దేవతల రూపమైన గోమాతకు అంకితం చేస్తామని చెబుతూ గోవధ అనర్థాలకు చేటని కేంద్రప్రముభుత్వం వెంటనే గోవును జాతీయమాతగా ప్రకటించాలని జ్యోతిష్పీఠాధీశ్వర శంకరాచార్యస్వామి అవిముక్తేశ్వ రానంద సరస్వతి స్వామిజీ అన్నారు. గోప్రతిష్ఠా ఆందోళన, గోధ్వజ్ స్థాపన భారత్ యాత్ర-2024ను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర శంకరాచార్య స్వాగతకమిటీ చైర్మన్ లక్ష్మీరాజం ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ అవిముక్తేశ్వరానంద సరస్వతి మాట్లాడూ పూజ్యశ్రీ శంకరాచార్య గోమాతను జాతీయమాతగా ప్రకటించడానికి 22 సెప్టెంబ రున అయోధ్య ధామలో రామకోట ప్రదక్షిణచేసి గోధ్వజ్ స్థాపన భారత్‌యాత్రను ప్రారంభించినట్లు, ఈ చారిత్రాత్మక యాత్ర ఈశాన్య భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోకి వెళ్లి గోప్రతిష్ఠ ధ్వజాన్ని స్థాపించినట్లు తెలిపారు. శంకరాచార్య ఈ యాత్రద్వారా భారతభూమిపై పూర్తిగా గోహత్య నిషేధించి, గోమాతను జాతీ యమాతగా ప్రకటించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. హిందూసమాజం గోరక్షకు



సభలో ప్రసంగిస్తున్న శ్రీ అవిముక్తేశ్వ రానాంద సరస్వతి స్వామిజీ

లకే ఓటువేయాలని, గోహత్యకు పాల్పడే పార్టీలకు ఓటువేయకండి, గోహత్యా పాపం చేయకండని హిందువులు హితవుపలికారు. గోసేవ భగవంతుడి సేవేనని, గోమాతలో అన్ని అంశాలు కలిసిపోతాయని, లలిత సహస్రనామంలో భగవతిని గోమాత అని పిలుస్తారని వివరించారు. గోమాత మన అన్ని కోరికలును నెరవేరే దేవత, ప్రత్యక్ష దైవమన్నారు. గోవును పాలకోసం కాదు.... ఆశీర్వాదం పొందడానికి గోసేవ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్, ఛైర్మన్ సి.లక్ష్మీరాజం, విజయ, శ్రీకాంత్ తదితర ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు.

# సంగీత నృత్య నాట్యకళలో శక్తి నిగూఢమై ఉంటుంది : నిర్మలారెడ్డి



యువకళోత్స వ గొల్లరామప్పకథ; భక్తప్రహ్లాద నాటక ప్రదర్శనల్లోని దృశ్యాలు

**రవీంద్రభారతి, అక్టోబరు 9 ప్రభాతవార్త :**
భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, నాటక తదితర కళల్లో ఎంతోశక్తి, ఔనత్యం నిగూఢమై ఉంటుందని, ఆ శక్తితో ఎన్నో కార్యాలు సఫలీకృతమౌతాయని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌళిక సదుపాయాల సంస్థ అధ్యక్షురాలు టి.నిర్మలా జయ ప్రకాష్‌రెడ్డి అన్నారు. తల్లిదండ్రులు పిల్లల్లోని కళాత్మక ఆసక్తిని గుర్తించి తదనుగుణం గా ఆయా కళలను నేర్పించి ప్రోత్స హిస్తే వాటిలో పేరుప్రఖ్యాతులు సాధించి అత్యు న్నతస్థాయికి చేరుకొంటారని తెలిపారు. నాటకాలు మన సంస్కృతి, సంప్రదా యాలను ఫరిడవిల్లింపజేయడమే కాక సందేశాత్మకం, ఆధ్యాత్మికంగా ప్రయోజకారిగా ఉంటాయని స్పష్టం చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర సంగీతనాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరం లో జరుగుతున్న యువకళోత్స వం మూడవ చివరిరోజు బుధవారం రాత్రి కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టి.నిర్మలా జయప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారిలతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి నాట్యప్రదర్శనలను ప్రారంభించి ప్రసంగించారు. అధ్యక్షోపన్యాసంలో డా. అలేఖ్య పుంజాల ఈ మూడురోజులపాటు జరుపుకొన్న యువకళోత్స వంలో సంగీతం, నృత్యం, నాటకం ప్రదర్శనలతో అలరిం చడమేకాక ముందుతరాలకు ప్రోత్సా హం, స్ఫూర్తినిస్తాయన్న సంతోషం, సంతృప్తి కలుగుతుందని అన్నారు. అనంతరం పూర్వ భారత ప్రధానమంత్రి పి.వి.నరసింహా రావు రచన ఆధారంగా అజయ్ మంకెనపల్లి దర్శకత్వంలో, వారి బృందంచే గొల్ల రామవ్వ కథ; శ్రీవెంకటేశ్వర సురభి థియేటర్‌వారి ఆధ్వర్యంలో భక్తప్రహ్లాద నాట కాల అద్భుత ప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.

# నేడు ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

## -పెద్ద తాళ్లకుంటలో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



**అత్తాపూర్ అక్టోబరు9, ప్రభాతవార్త :** శ్రీ ప్రణవ భక్త సమాజం హైదర్‌గూడ వారి ఆధ్వర్యంలో (గురువారం)నేడు జరగబోయే బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లను పెద్ద తాళ్లకుంటలో శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ, కమిటీ సభ్యు లు వేక్షించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...పెద్ద తాళ్లకుంటలో జరగబోయే బతుకమ్మ ఏర్పాట్లకు పూర్తి చేయాలని అన్నారు. హైదర్‌గూడ ఉప్పరపల్లి , శివానగర్ , కృష్ణానగర్ , కేశవ నగర్, రాధాకృష్ణ నగర్, కాంతరెడ్డి నగర్ కాలనీ వాసు లతో పాటు చుట్టు పక్కల మరిన్ని కాలనీవాసులు ఆటపాటలతో ఆడుకుంటూ పెద్ద ఎత్తున్న బతుకమ్మలతో విచ్చేస్తారని అన్నారు. కావున కుంటలో పెరిగిన గుర్రపు డెక్క ఆకును పూర్తిగా తొలగించాలని, తాత్కాలిక బేబి పాండ్‌ను ఏర్పాటు చేయాలని జిహెచ్‌ఎంసి ఏఈ నరసింహ మూర్తి మరియు వర్క్ ఇన్స్‌పెక్టర్ రాజులకి తెలియజే శారు. రాత్రిపూట చీకటి ఉంటుందని కాబట్టి భక్తులకు మహిళలకు ఎలాంటి ఇబ్బం దుల కలగకుండా పూర్తి స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, ప్రణవభక్త సమాజం ముఖ్యసలహాదారు నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్ కుమార్, కాకులారం కృష్ణ, ఎల్.వెంకటేష్, ఎం.ఉపేందర్ రెడ్డి, ఎం.శ్యాం సుందర్ రెడ్డి, ఎం.రామ్ రెడ్డి, గొల్ల అనిల్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, బాలు, శానిటేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ అసెంబ్లీకి నిధులు విడుదల చేయాలి : ఆదం సంతోష్

**అడ్డగుట్ట, అక్టోబరు 9 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యే క నిధులు విడుదల చేయాలని కోరుతూ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఆదం సంతోష్ కుమార్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు.



హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత ఆదం సంతోష్ తదితరులు

## బతుకమ్మ సంబరాల్లో కొంతం దీపిక



శివాజీ నగర్ బతుకమ్మ సంబరాల్లో కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**అడ్డగుట్ట, అక్టోబరు 9 ప్రభాతవార్త:** దేశీ శరన్నవరాత్రి మహోత స్వాలో ల్లో భాగంగా మంగళ వారం మోండా డివిజన్ శివాజీ నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ దాండియ వేడుకలకు మోండా కార్పోరేటర్ కొంతం దీపిక పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మహిళలతో బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నీలిమా మహిళా గ్రూప్‌తో కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అని ల్, రంగయ్య, భాగ్యశ్రీ, నీలిమలు పాల్గొన్నారు.

### చింతల్ దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 9 ప్రభాతవార్త**
చింతల్ డివిజన్ చింతల్‌లో దుర్గామాత దేవీశరన్నవరాత్రుల ఉత్స వాలు ఘనంగా నిర్వ హించారు. బుధవారం చింతల్ ఉత్స వకమిటీ ఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చెల్ మల్లాజ్‌గిరి జిల్లా నాయకులు బండి శ్యామ్‌గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదానకార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతల్ ఉత్స వకమిటీ నిర్వాహకులు, స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.
**భరత్‌సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో :** దుర్గాదేవి శరన్నవరాత్రుల ఉత్స వాలలో బాగంగా బేధవా నం కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వనగర్ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరిజిల్లా భారతీయ జనతాపార్టీ కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ్మారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరనగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు నాగదీప్‌గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్ర మానికి వందలాదిమంది హాజరై అమ్మవారి కృపకు పాత్రులై అన్నదానంలో పాల్గొన్నారు.

### వడ్డెర కులస్థుల పరిరక్షణకు సమిష్టిపోరు తప్పదు

**-రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య**

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** తెలంగాణలో వడ్డెర కార్మికులకు, నాయకులకు రక్షణ లేకుండా పోతుందని రాష్ట్ర వడ్డెరసంఘ అధ్యక్షులు ఎత్తరి మారయ్య ఆందోళన వ్యక్తం చేశారు. యశోధ ఆసుపత్రిలో వడ్డెరసంఘ నాయకులు కథాల్‌పై ఉద్దేశపూర్వ కంగా దాడీచేయటంతో పాటు హత్యకు కుట్రపన్నినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆయన ఆందోళనవ్యక్తం చేశారు. కడ్తాల్ టోల్‌గేట్ వద్ద రాష్ట్రవడ్డెర సంఘనాయకులు పీట్ల కథాల్‌పై దాళ్లతో దాడీచేయటంతో పాటు ఆయనను కిడ్నాప్ చేసేందుకు ,హత్య చేసేందుకు సంజీవ్‌యాదవ్ అతని అనుచరులు యత్నించిన ఇంతవరకు వారిఐ ఎలాంటి చర్యలు లేకపోవడం విచారకరమన్నారు. కడ్తాల్ టోల్‌గేట్‌వద్ద సంజీవ్‌కుమార్ దాడీచేయ టాన్ని ఖండిస్తున్నామని, తక్షణం సంజీవ్‌యాదవ్‌ను అరెస్టుచేయాలని లేనిపక్షంలో జిల్లా ఎస్పిదృష్టికి తీసుకుపోయి ఎస్పి కార్యాలయం ముందు ధర్నా, రాస్తారోఖో నిర్వహిస్తా మని, అతిదారుణంగా దాడీచేయటంతోపాటు భయభ్రాంతులకు గురిచేయడం వంటి విష యమై తాము పోలీసలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మహిళా అధ్యక్షు రాలు దేరంగుల రూప, యువజన విభాగం అధ్యక్షులు కొమ్మరాజుల శేఖర్, జగన్, రాము, కొమ్మరాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మహబూబ్ కళాశాలలోని విద్యా సంస్థల లైసెన్స్ రద్దు : పి.ఎల్.శ్రీనివాస్

**-విద్యార్థులకు, ఉద్యోగులకు ఎలాంటి ఆటంకాలు జరుగవు**



విలేకర్ల సమావేశంలో మహబూబ్ కళాశాల అధ్యక్షులు పి.ఎల్.శ్రీనివాస్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ ప్యాట్నీ చౌరస్తాలో ప్రసిద్దిగాంచిన మహబూబ్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న విద్యా సం స్థలకు జారీ చేసిన లైసెన్స్‌లను రద్దు చేసినట్లు మహబూబ్ నగర్ విద్యా సంస్థల అధ్యక్షులు పి.ఎల్.శ్రీనివాస్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకట్ నారా యణ ఎడ్యూకేషనల్ ఇనిస్టిట్యూట్‌కు 2015లో విద్యా సంస్థలు నడిపిం చేందుకు లైసెన్స్‌లు జారీ చేశామన్నారు. హైస్కూల్, ఇంటర్, డిగ్రీ, ఎస్.వి. ఐటీ. ఇంజనీరింగ్, ఎంబిఏ చదువుతున్న విద్యార్థులందరికి ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా యధా విధిగా క్లాస్‌లు కొనసాగుతాయన్నారు. అదే విధం గా టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల జీత భత్యాలు తామే చెల్లిస్తామన్నారు. ఇక నుంచి వి.ఎన్.ఇ.ఎస్.చైర్మన్‌గా కొనఁసాగుతున్న కె.వి.కె.రావ్‌కు ఎలాం టి హక్కు లేదన్నారు. లైసెన్ రద్దు చేయడంతో కెవి.కె.రావ్ నిబంధనలకు విరుద్ధంగా బౌన్స్‌లర్లను పెట్టడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ కళాశాల మేనేజింగ్ కమిటీ ప్రతినిధులు వినోద్‌కుమార్, నరేశ్ యాదవ్, డాక్టర్ అనీల్‌కుమార్, డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, అక్టోబరు 9 ప్రభాతవార్త:**
మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. దసరా శరన్నవరాత్రి మహోత్స వాల్లో భాగంగా బోయిన్‌పల్లి చౌరస్తాలోని విద్యాగణపతి ఆలయంలో బిఆర్ఎస్ నాయకుడు ఆర్.టింకూగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దుర్గామాతను వేడు కుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హు మాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాశ్ బాంటియాలు పాల్గొన్నారు.

### అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : టీఎన్.

**కంటోన్మెంట్, అక్టోబరు 9 ప్రభాతవార్త:**
ఆకలి మంటలతో అలమటిస్తున్న నిరుపేదలకు అన్నదానం చేస్తే పుణ్యం కలుగుతుందని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. కంటోన్మెంట్ 3వ వార్డు సిఖ్ విలేజ్‌లో నల్లపోచమ్మ దేవాల యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆనంద్, రాఖేష్ తదితరులు పాల్గొన్నారు.



పంజాగుట్టలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## శరన్నవరాత్రోత్సవాల్లో శ్రీసరస్వతీదేవిగా అమ్మవారు



శ్రీ సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

**నాంపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త :**
తొమ్మిదిరోజులపాటు నేత్రపర్వంగా జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్స వాల్లో భాగంగా ఈనాటి 8వ రోజు బుధవారం పార్వతీ అమ్మవారు శ్రీ సరస్వతీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పిల్లలు చదువులతల్లి సరస్వతిదేవికి పుస్తకాలు సమర్పించగా అర్చకస్వాములు 250మందికిపైగా విద్యార్థుల నాలుకమీద అమ్మవారి బీజాక్షరాలను హోమంనెయ్యి దర్భంతో వ్రాసి ఆశీర్వదించారు. తెలంగాణ దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో అమ్మవారికి శరన్నవరాత్రోత్స వాల్లో ఉదయం 5గంటల నుండి అమ్మవారి అభిషేకము; ఉదయం 9గంటలకు అమ్మవారి అలంకార దర్శనము; ఉదయం 10లకు అమ్మవారి హవనము, లఘు పూర్ణాహుతి, మహానివేదన; మధ్యాహ్నం 12 గంట టలకు మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ; రాత్రి 6.30గంటల నుండి శ్రీ లలితా సహస్రనామార్చన, నివేదన, మంగళహార తి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ కావించినట్లు ఆలయ కార్య నిర్వా హణాధికారి పి.లక్ష్మారెడ్డి తెలిపారు. అమ్మవారి దివ్యాలంకరణలో భా గంగా 10 గురువారం శ్రీదుర్గాదేవి అలంకారంతోపాటు ఉదయం 9 గంటలకు చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన వివరించారు.

## మార్కెట్‌కి వచ్చే ప్రతి రైతుకు న్యాయం చేస్తాం!

**-చిలుక మధుసూదన్ రెడ్డి**



చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**అబ్దుల్లాపూర్మెట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
మూసి ప్రక్షాళన చేపట్టిన రాష్ట్ర ప్రబుత్వానికి మద్దతు తెలియచేస్తూ మూసి తీర ప్రాంత రైతులకు మూసి ప్రక్షాళన చేయడం ద్వారా రైతులకు న్యాయం తో పాటు వారి కష్టాలు తీరుతాయని గడ్డి అన్నారం వ్యవసాయం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల శ్రేయస్సు వారి సంక్షే మమే తమకు ముఖ్యం అన్నారు. బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాల యంలో చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల మార్కెట్ లో త్వరలో హమాలీలకు లైసెన్సులు ఇవ్వాలని, ఎవరైతే మార్కెట్ లో ఉండి కష్టపడి పని చేస్తున్నారో వారిని గుర్తించి ఇవ్వాలని అన్నారు. గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ గొడుగు కింద పనిచేస్తున్న రైతు బజార్లను, ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. సమా వేశం అనంతరం మార్కెట్ ఆవరణలో మహిళా ఉద్యోగులు ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి ని వర్తకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాస్కర చారి, జైపాల్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, నరసింహ, బండి మధుసూదన్ రావు, నవరాజ్, గోవర్దన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, ప్రత్యేక అహ్వానితులు పిఏసిఎస్ చైర్మన్ చామ కృష్ణ రెడ్డి, ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ అధికా రులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ నేరస్తుడి అరెస్ట్

## -33 కేసుల్లో 74 స్నాచింగ్‌లు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
చైన్ స్నాచింగ్ లు చేసే అంతర్జాతీయ నేరస్థున్ని పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 59 గ్రాముల బంగారం రూ 2.50 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన విశ్వనాథ్ కొలువాడి అలియాస్ అచ్యుత్ కుమార్ (34) కర్ణాటక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అనేక చైన్ స్నాచింగ్లకు పాల్పడ్డాడు. మొదటగా 2015 సంవత్స రంలో చేంజ్ మ్యాచింగ్ చేసిన కేసులో పోలీసులు అరెస్టు చేశారు. అలా ఇతనిపై 33 కేసులు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో 74 చైన్ స్నాచింగ్ లకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. కాగా బుధవారం కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ ప్రాంతంలో అతన్ని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 59 గ్రాముల బంగారం, రూ 2.50 లక్షల నగదు ఒక ద్విచక్ర వాహనం మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నేరస్తుని పట్టుకోవడంలో చొరవ చూపి న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

**IN THE COURT OF THE 21st JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT HYDERABAD**
**O.S.NO. 4362 OF 2023**
**Between:**
Smt.Gollapudi Venkata Seshamamba C/o Late Sri Gollapudi Seshaiah
...**PLAINTIFF**
**And**
Smt. G.Madhuri @ Pinnamaneni Madhuri, W/o Sri Kiran Pinnamaneni
...**DEFENDANT**
To:
Smt. G.Madhuri @ Pinnamaneni Madhuri, W/o Sri Kiran Pinnamaneni, H/o 8-3-168/20/30/31, Sri Sai Ram Prestige, Sidharthnagar North, Kalyannagar, Hyderabad. Telangana
...**Defendant**
WHEREAS the Petitioner afore-mentioned filed a suit for Recovery of Money the above O.S. No. 4362/2023, against Defendant.
You are required to appear in the Court on D/28thOctober, 2024at 10-30 a.m., Forenoon in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings. In default of such appearance on the aforesaid day, the Petition will be heard and determined in your absence.
**(BY ORDER OF THE COURT)**
**S.BALACHANDER & Y.SIVA GOPAL**
Advocates,
Plot No. 63, Road No. 1-C Krishna Nagr, NFC Road Moula-Ali, HDERABAD - 500 040.
**Tel : 9440470639 & 9866165456.**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. DISTRICT AND SESSIONS CUM II ADDL. MSJ CUM II ADDL. FAMILY COURT JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT : AT : MEDCHAL**
**E.P. NO. 206 OF 2023**
**IN**
**O.S. NO. 1512 OF 2013**
Between:
**M. Rajitha** ...**Decree Holder**
And
**V.N.R. Constructions** Rep. by G. Venkateswara Rao & Another
...**Judgment Debtors**
To
**1) V.N.R. Constructions Rep by G. Venkateswar Rao** S/o G. Narayana Rao, Aged 47 years, Occ : Business Office At Flat No. 503, Plot No.2 & 3 Srinivasa Residency, Sai Sagar Enclave, Tirumalgherry, Secunderabad.
**2) Y. Sreedevi** W/o Y. Srinivas Reddy Aged about 32 years, Occ : House Wife R/o Flat No. 202, Sadhartha Apartments Castle Hills, H.No.10-3-311/17/B, Behind NMDC Masab Tank, Hyderabad.
...**Judgement Debtors**
Please take notice that the above named Decree Holder have filed the above Execution Petition against you and another, to Execute the Sale Deed and Deliver the Possession of all that Flat bearing No. 102 admeasuring 1836 sq.feet including common area with undivided share of 59 sq.yards in out of 1472 sq. yards Plot No. 2 in Sy No. 187 cover under Block No. 6, Srinilya Enclave, adjoining Godavari Homes, Jeedimetla Medchal District bounded by: North: Stair Case and open to sky, South: Open to Sky, East: Corridor, West: Open to sky, in her favour. The above Execution Petition is posted for your Appearance on **25/10/2024, at 10.30 a.m.** before the above said Hon'ble Court either in person or through your counsel failing which the matter will be heard and decided in their absence in accordance with law.
//BY THE ORDER OF THE HON'BLE COURT//
**Sd/- CH SHANTHA**
**N.V. ARUNA BAI**
**Advocates**
**Mobile: 8008311553**
**Counsel for the Decree Holder**

# ఉప్పల్‌లో మండపాల వద్ద ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు



రామంతాపూర్‌లో అమ్మవారి మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లోని అమ్మవారి మండపాల వద్ద బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ నల్ల పోచమ్మ ఆలయంలో మాజీ కార్పొరేటర్ పోగుల సుగుణ, దయాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాలు ఆనందోత్సవాలతో చేసుకోవాలని సూచించారు. ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రామంతాపూర్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పలు మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందిరానగర్ మార్కండేయ దేవాలయం పద్మశాలి భవన్‌లో చండీమాగంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మండప నిర్వహకులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# భగాయత్‌లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు : పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్‌లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ భగాయత్ కాలనీవాసులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగాయత్‌లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, సిఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఇళ్ల నిర్మాణానికి ఆటంకం తొలగిపోయిందని తెలిపారు. ఇక నుంచి భగాయత్‌లో అనుమతులు ఇవ్వడంతోపాటు, కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు సిఎం రేవంత్‌రెడ్డి, ఎం.పరమేశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎం.డి.తౌఫిక్, డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్, కాలనీ నేతలు రేవు కృష్ణయ్య, సర్వ నరసింహా యాదవ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, జలీల్‌పాషా, శాగ రవీందర్, గరిక సుధాకర్, బాల కృష్ణనగర్ కాలనీ నేతలు కె.స్వామి, వేణుగోపాల్, తిక్కారెడ్డి, గౌటి స్వామి, కాశీంగౌడ్, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సైదులు, కె.నాగరాజు, శంకర్‌గౌడ్, నరసింహా, బ్రహ్మయ్య, జిల్లు, సందీప్,భాస్కర్, సతీష్‌గౌడ్, జంగయ్య, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్ భగాయత్‌వాసులతో సమావేశమైన కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

# మహేశ్వరం నియోజకవర్గంలో మెట్రో రైల్ సేవలు విస్తరించండి



మెట్రో రైల్ ఎండికి వినతి పత్రం ఇస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అందెల శ్రీరాముల యాదవ్

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసికి ఆనుకొని ఉన్న చేవెళ్ళ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గంలో మెట్రో రైల్ సేవలను విస్తరించాలని పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హైద్రాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డికి సూచించారు. ఎల్‌బినగర్ నుండి శంషాబాద్ వరకు విస్తరిస్తున్న మెట్రో రైల్ కారిడార్‌లలో మార్పులు చేసి

## ఎండి ఎన్‌విఎస్‌రెడ్డికి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినతి

మంద మల్లమ్మ చౌరస్తా నుండి మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తా, శివాజీ చౌక్, మల్లాపూర్, ఆర్‌సిఐల గుండా ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైల్ సౌకర్యం కల్పించాలని పట్టుబడుతున్న మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ బుధవారం ఎంపి కొండాతో కలిసి మెట్రో రైల్ ఎండిని కలిశారు. ఈ సందర్భంగా ఎంపి చేతుల మీదుగా ఎన్‌విఎస్‌రెడ్డికి కారిడార్ల మార్పులతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలో విశేష సేవలందిస్తున్న మెట్రో రైల్ ప్రాజెక్ట్ కింద కొత్తగా చేపట్టాలనుకున్న ఎల్‌బినగర్ టు శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ మార్గం ఏర్పాటు విషయంలో అందెల కోరినట్లుగా మార్పులు చేయాలని అన్నారు కారిడార్లలో మార్పుల వల్ల దూరాభారం కూడా తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు తమ వినతిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుర్రంగూడ కార్పొరేటర్ గడ్డం లక్ష్మారెడ్డి పాల్గొన్నారు

## హైదరాబాద్ టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా రామకృష్ణారెడ్డి



రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న అందెల, బిజెపి నేతలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** హైదరాబాద్ టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షునిగా పని చేస్తున్న రామకృష్ణారెడ్డిని హైదరా బాద్ టెలిఫోన్ బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా న్యూఢిల్లీలోని భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) నియమించింది. ఈ మేరకు సంస్థ తరపున బిఎస్ఎన్ఎల్ సెక్షన్ ఆఫీసర్ (పిహెచ్‌పి) దినేష్ చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన బిఎస్ ఎన్ఎల్‌లో హైదరాబాద్ టెలిఫోన్ బోర్డు అడ్వయిజరీ కమిటీకి మెంబ ర్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహేశ్వరం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరా ములు యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

**రామకృష్ణారెడ్డికి బిజెపి నేతల సన్మానం.. అభినందనలు**

టెలిఫోన్ అడ్వయిజరీ బోర్డు సభ్యునిగా నియమితులైన రామకృష్ణారెడ్డిని బుధవారం మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, నాయకులు బంగారు ప్రభాకర్, మంత్రి మహేష్ ముదిరాజ్, నిమ్మల రవికాంత్‌గౌడ్, యాతం వెంకటేష్, తోట ప్రతాప్‌రెడ్డిలతో పాటు పలువురు అభినందించి సన్మానం చేశారు.

## వెలుగుగుట్ట ఆలయం ట్రస్ట్ కార్యవర్గం ఎన్నిక

**ఉప్పల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ వెలుగుగుట్టలోని శ్రీ దుర్గా మల్లికార్జునస్వామి ఆలయ కొత్త ట్రస్ట్ కమిటిని బుధవారం నియమించారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.మధుబాబు, కార్యనిర్వహణ అధికారి ఎ.రమాదేవి కొత్త ట్రస్ట్ కమిటి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ట్రస్ట్ కమిటి చైర్మన్‌గా జన్ని రఘు కురుమ, కమిటి సభ్యులుగా ప్యాట మురళీకృష్ణ, సోము బాలమణి, మాదాడి రమేష్‌బాబు, గన్నారం విజయ్‌కుమార్, రొండ్ల శ్రీకాంత్‌రెడ్డి, సోము జంగయ్య, ఎక్స్ అఫిసియో మెంబర్‌గా కొందూరు రమేష్‌శర్మ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వెలుగుగుట్ట ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో భక్తులకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సల్ల ప్రభాకర్‌రెడ్డి, పాశికంటి నాగరాజు, గణేష్‌నాయక్, వీరేందర్, గొరిగె మల్లేష్, పలువురు కురుమ సంఘం నేతలు, ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో బిజెపి కార్పొరేటర్ల పూజలు

**ఉప్పల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామంతాపూర్ రాంరెడ్డినగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బుధవారం స్థానిక కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటి నేతలు కార్పొరేటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ కార్యదర్శి చెల్మోజు ఎల్లాచారి, మహేష్, నేతలు పెంటపల్లి వెంకన్న, లక్ష్మణ్, నాగరాజు, నంబకొటి శివ, రవి, గణేష్, శ్రీనివాసాచారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ పండుగకు భారీ ఏర్పాట్లు : బన్నాల గీత



బ్యాంక్‌కాలనీలో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో బతుకమ్మ పండుగకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బ్యాంక్‌కాలనీ పార్కులో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో బన్నాల గీత మాట్లాడుతూ పార్కులో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సంపు మరమ్మతులు చేపడుతున్నామని, విగ్రహాలకు పెయింటింగ్‌లు వేయించినట్లు తెలిపారు. ప్రతి కాలనీలో ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవర్లు, జెసిబిలతో గుంతలు తవ్వించినట్లు తెలిపారు. బతుకమ్మ ఆడే ప్రాంతాలలో ప్రత్యేకంగా వీధిదీపాలు ఏర్పాట్లు చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, శ్యామ్,బాలు, బంటి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**సైదాబాద్. అక్టోబరు 9 ప్రభాతవార్త:** చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. చంపాపేట ప్రధాన రహదారిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయం ముందు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బచ్చు యాదమ్మ సహకారంతో బహుమతులు, అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో సంఘం కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్‌గుప్తా, అమావాస్య అన్నదాన కమిటీ కన్వీనర్ ఇడుకుల విజయనాథ్, సంయుక్త కార్యదర్శి ఊరె మధుసూధన్ గుప్తా, కోశాధికారి రమణయ్య,విశ్వనాథం సాయిరాం పాల్గొన్నారు.

## పండక్కి ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి : ఇన్స్‌పెక్టర్ నాగరాజు

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** దసరా పండుగకు ఊరెళ్లే ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కీసర నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన దొంగతనాలపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను పిఎస్ ఆవరణలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లకు తాళాలు వేసి ఊరెళ్లే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే చోరీలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఊరెళ్లే ఆటో ద్వారా లౌడ్ స్పీకర్‌తో కాలనీల్లో ప్రచారం చేయిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**వనస్థలిపురం అక్టోబరు9,ప్రభాతవార్త :** వనస్థలిపురం సచివాలయ నగర్‌లో గల శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.బుధవారం సుప్రభాత సేవ,సువర్ణ,పుష్పార్చన ,ఉత్సవ మూర్తులకు అభిషేకం,సరస్వతి హోమం,తిరుచిది ఉత్సవం,లక్ష తులసి పుష్పార్చన,శ్రీవారి కళ్యాణ మహోత్సవం,అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాలు హిందువులకు అతి పవిత్రమైనవి : ఎంపి ఈటల



మల్కాజిగిరి గాంధీ పార్కులో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్

**మల్కాజిగిరి అక్టోబరు9,ప్రభాతవార్త :** దేవీ నవరాత్రి ఉత్సవాలు హిందువుల ప్రతి పవిత్రమైన,మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.బుధవారం మల్కాజిగిరి గాంధీ పార్క్‌లో గత పాతిక సంవత్సరాలకు పైగా మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలు ఎంపి ఈటల రాజేందర్,బిజెపి రాష్ట్ర నాయకుడు వి.కె మహేష్ ముదిరాజ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ... ప్రధాన నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డిఎన్ వెంకటేష్,మాజీ కార్పొరేటర్ మంజుల గౌడ్,నాయకులు మహేందర్ గౌడ్,పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**తుర్కయంజాల్ అక్టోబరు9,ప్రభాతవార్త :** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని తొర్రూర్ ఫంక్షన్ హాల్‌లో పురపాలక సంఘ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి అధ్యక్షతన ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, నూనెలు ఏకరూప దుస్తులు మరియు దసరా బట్టలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని వారితో బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.అనంతరం సిబ్బంది అందరితో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్త కుర్మా మంగమ్మ,శివకుమార్,మున్సిపాలిటీ కౌన్సిలర్ కౌశల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య,కౌన్సిలర్లు కుంట ఉదయ శ్రీ గోపాల్ రెడినడ,బొక్క రవీందర్ రెడ్డి,మర్రి మాధవి,మహేందర్ రెడ్డి,నా రని కవిత,శేఖర్ గౌడ్,రెవెల్లి హరిత,యాదగిరి, నక్క శివ లింగం గౌడ్,అధికారులు,సిబ్బంది,పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ చీఫ్ విప్ పదవి రావడం హర్షణీయం : మాజీ కార్పొరేటర్



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

**సైదాబాద్. అక్టోబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ శాసన మండలిలో చీఫ్ విప్‌గా బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని చంపాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చంపాపేట నుంచి కార్యకర్తలతో మహేందర్‌రెడ్డి నివాసానికి తరలివెళ్లిన రమణారెడ్డి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా మహేందర్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేశారని, అదేవిధంగా చంపాపేట డివిజన్ అభివృద్ధికి అనేక రకాలుగా సహాయమందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, ధర్వేష్‌ఖాన్, సుర్వి పెంటయ్యగౌడ్, దేరంగుల కృష్ణ, గంగబాబు, కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, కరీంభాయి, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.

## హనుమాన్ దేవస్థానంలో సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్. అక్టోబరు 9 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మూలానక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకము, అలంకరణ నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. దేవాలయ పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి సుమిత దంపతులు చిన్నారులకు నోటు బుక్కులు, పెన్నులు, పలకలు, బలపాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ అత్యంత మహిమ గల కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయ కార్యనిర్వాణాధికారి వి.ప్రేమ్ కుమార్ రావు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు సురేష్ గౌడ్, గూడూరు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## కోలాహలంగా బతుకమ్మ, దాండియా వేడుకలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ, కోలాటం దాండియా సంబరాలు చైతన్యపురిలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ బతుకమ్మ, పండగలు, ఉత్సవాలు, ప్రజల్లో ఐక్యతను, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ సంబరాలు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, నీలా శ్రీధర్, చందా భాగ్యలక్ష్మి, అంకలపల్లి మంజుల, చకిలం రమణయ్య, ఉప్పల స్వప్న, చందా భాగ్యలక్ష్మి, గౌరి జగతి, బెల్లు చంద్రశేఖర్,కటకం శ్రీనివాస్, ఎల్‌వి. కుమార్,శ్రీనివాస్,నరేష్, సినీనటి సంధ్య పాల్గొన్నారు.

## అమ్మవారికి మంగళసూత్రాలు సమర్పణ



అమ్మవారి చిత్రపటాన్ని రాజశేఖర్‌కు అందజేస్తున్న శ్రీనివాసరావు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఆర్‌కెపురం కుర్తాళపీఠం శ్రీప్రత్యంగిరా దేవాలయంలో పీఠాధిపతులు జగద్గురు శ్రీసిద్దేశ్వరానందభారతీ మహాస్వామి ఆశీస్సులతో శ్రీదేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ పూజా కార్యక్రమానికి డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లీలా సరస్వతీ దంపతులు అమ్మవారికి బంగారు మంగళ సూత్రాలు సమర్పించారు. ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు వారికి అమ్మవారి జ్ఞాపికను అందచేశారు.అమ్మవారు శ్రీమహాసరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌శర్మ, హేమంత్‌శర్మ, రామశర్మ, నిఖిల్‌శర్మ, అరుణ, శ్రీపతి, ఆశ్వంత్ పాల్గొన్నారు.

## చైతన్యపురి ఇన్స్పెక్టర్‌కు సత్కారం



ఇన్స్పెక్టర్ను సన్మానిస్తున్న విటల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** చైతన్యపురి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావును చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విట్టల్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో సత్కరించారు. శాంతిభద్రతల నిర్వహణ విషయంలో తాము పోలీసులకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ మాజీ అధ్యక్షులు పవన్, నాయకులు వీరన్నయాదవ్, కృష్ణ, జలంధర్, న్యూఇందిరా నగర్‌కాలనీ అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.

## బస్తి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** బస్సులోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ సరూర్నగర్ మండల సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ఫేస్ టులో త్రాగునీటిలో మురికినీరు కలుషితం అవుతున్నాయని ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలంలో బస్తీ ముంపునకు గురవుతుందని ఓపెన్‌నాలా మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ, బోయపల్లి రాములుగౌడ్, ఎం.మదిలేటి, లక్ష్మీ, రమాదేవి, అనురాధ,ముత్తమ్మ, అనిత పాల్గొన్నారు.

## చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**సైదాబాద్. అక్టోబరు 9 ప్రభాతవార్త:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సైదాబాద్ డివిజన్ మాతా మైదానంలోని శ్రీ విజయదుర్గా మాత బుధవారం శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కావేటి మురళి మనోహర్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిఎం రేవంత్ రెడ్డిని తన కూతురు వివాహానికి హాజరై వధువరులను ఆశీర్వదించాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలసి వివాహ ఆహ్వాన పత్రికను అందిస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి.

## చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద మృతదేహం లభ్యం

**మలక్‌పేట అక్టోబరు9,ప్రభాతవార్త :** చాధర్‌ఘాట్ బ్రిడ్జి కింద మృతదేహం లభ్యమైన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసుల కథనం ప్రకారం...చాదర్‌ఘాట్ బ్రిడ్జి కింద ఓ మృతదేహం కనిపిండంతో స్థానికులు గమనించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడు చాదర్‌ఘాట్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ అలి (55)గా గుర్తించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చరీకి తరలించారు.మృతుడు ప్రమాదవశాత్తు కిందపడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో చండి హోమం



దేవాలయంలో చండీ హోమాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**మలక్‌పేట అక్టోబరు9,ప్రభాతవార్త :** మలక్‌పేట హరిహర క్షేత్రంలో శ్రీ దేవి నరవాత్రి ఉత్సవాలలో భాగంగా దేవాలయంలో చండీ హోమాన్ని ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చండీ హోమం పూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సూగూరు రమేష్,ఆలయ ఈవో మార్తండ రావు,అర్చకులు మంగళగిరి శ్రీనివాస చార్యులు,కాసుల చంద్రశేఖర్ శర్మ,సభ్యులు సరాపు శ్రీహరి,వనం సత్యేందర్,రేణు అగర్వాల్,పారిజాతారెడ్డి, విజయకుమార్ ,దొడ్డి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : పోల్కమ్ శ్రీనివాస్



చీఫ్ విప్‌గా ప్రమాణస్వీకారం చేసిన పట్నం మహేందర్ రెడ్డిని సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

**మలక్‌పేట అక్టోబరు9,ప్రభాతవార్త :** కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబిసి సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు.ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చీఫ్ వీప్‌గా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పోల్కం శ్రీనివాస్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిమూలం శంకర్,పోల్కం వినయ రాజు,వెన్ను శివ కుమార్,పల్లాల నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాస్థలిలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**వనస్థలిపురం అక్టోబరు9,ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని రైతు బజార్ హూడా పార్క్‌లో దుర్గాస్థలి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గా అమ్మవారి విశేష పూజలు జరుగుతున్నాయి.బుధవారం అమ్మవారిని శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులు పూజలు నిర్వహించి అమ్మ ఆశీస్సులు పొందారు.అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.గురువారం సాయంత్రం సామూహిక పుష్పార్చన జరుపబడుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బుద్దోలు అర్జున్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో విష్ణు,భిక్షపతి ,యుగేష్ గౌడ్,గంగం శివశంకర్, నరేందర్,నాని కృష్ణ,శివ,అంజన కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలి : కార్పొరేటర్



ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య పనులను చేయిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట అక్టోబరు9,ప్రభాతవార్త :** పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.డివిజన్‌లోని సంజీవయ్య నగర్ ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్ విభాగం సిబ్బందితో పారిశుధ్య పనులను ఆమె చేయించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....ప్రభుత్వ పాఠశాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డివిజన్ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎఎంహెచ్ఓ అనురాధ పారిశుధ్య విభాగం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సోమనాథ్ క్షేత్రంలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**వనస్థలిపురం అక్టోబరు9,ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని శ్రీ సోమనాథ్ క్షేత్రంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ట్రస్ట్ సభ్యులు ,భక్తుల సమక్షంలో ఘనంగా జరుగుతున్నాయి.శుక్రవారం చండీ హోమం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరుగుతుందని ఉదయం 9 గంటలకు జరిగే చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ట్రస్ట్ సభ్యులు కౌశిక్ మహర్షి,రఘు రాములు,తెలిపారు.

## సరస్వతి నగర్‌లో దేవి నవరాత్రి ఉత్సవాలు



జ్ఞాన సరస్వతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

**మల్కాజిగిరి అక్టోబరు9,ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని అనంత సరస్వతి నగర్‌లో దేవి నవరాత్రుల సందర్భంగా జ్ఞాన సరస్వతి దేవాలయంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ ,బి.కే శ్రీనివాస్,సిక్కా ప్రభాకర్ గౌడ్,కిషోర్, ఇంద్రసేనా రెడ్డి,సత్తయ్య, యాదగిరి,హరీష్,పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు



మహేందర్ రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న రాంమోహన్ గౌడ్

**వనస్థలిపురం అక్టోబరు9,ప్రభాతవార్త :** శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి శాసన మండలి చీఫ్ విప్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఎల్.బి నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రాంమోహన్ గౌడ్ మండలి కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

## మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టు

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** కొడంగల్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్రకు వెళ్ళకుండా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. బుధవారం ఉదయం శ్రీనగర్‌లోని ఆమె నివాసం నుండి బయటకు రాకుండా పోలీసులు ఇంటి వద్ద మొహరించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తనను పోలీసులచే హౌస్ అరెస్టు చేయించడాన్ని సబితా ఇంద్రారెడ్డి ఖండించారు.